క్లుప్తంగా

సుల్తానాబాద్‌లో భారీ వర్షం



సుల్తానాబాద్‌లో కురుస్తున్న వర్షం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండల కేంద్రంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉరుములతో కూడిన వర్షం కురవడంతో పట్టణంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు సిబ్బంది సంయుక్తంగా పలు ప్రాంతాలకు వెళ్లి చెట్లకొమ్మలు తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ స్తంభాలు, వైర్లను ప్రజలు తాకొద్దని, ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రంగు శంకరయ్య తెలిపారు.

వర్షాలు కురవాలని పూజలు

ధర్మారం: మండలంలోని దొంగతుర్తిలో గురువారం వర్షాలు కురవాలని కోరుతూ గ్రామంలోని సమ్మక్క, మైసమ్మ, పోచమ్మ ఆలయాలలో పూజలు చేశారు. మృగశిర కార్తె చివరికి వచ్చినా.. వర్షాలు కురవక పోవడంతో వ్యవసాయ పనులు సాగడం లేదని వర్షాలు కురవాలని కోరుతూ రైతులు, ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు పూజలు చేశారు. మాజీ సర్పంచ్ జుంజుపల్లి రమేశ్, మాజీ ఎంపీటీసీ చొప్పరి చంద్రయ్య, ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు లైసెట్టి రమేశ్, రైతులు ఆకుల తిరుపతి, కాల్వ బాపన్న పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి



తనిఖీ చేస్తున్న అధికారులు

జూలపల్లి: వ్యవసాయ శాఖ ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను డీలర్లు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష సూచించారు. మండల కేంద్రంలోని విత్తన, ఎరువుల దుకాణాలను ఎస్సై శ్రీధర్‌తో కలిసి సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తి, వరి విత్తనాలతోపాటు బిల్లులు, రికార్డులను పరిశీలించారు. ప్రతి కొనుగోలుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని, స్టాకును నోటీసు బోర్డులో రాయాలని, విత్తనాలు కొన్న రైతులు రశీదులను భద్రపరుచుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మండల విద్యాధికారిని మార్చండి

మంథని: మంథనిలో విద్యావ్యవస్థ గాడి తప్పిందని, విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్న మండల విద్యాధికారిని వెంటనే మార్చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్ కోరారు. గురువారం ప్రజా సంఘాల నాయకులంతా ఎంఈవోను కలిసేందుకు కార్యాలయానికి వెళ్తే గేటుకు తాళం వేసి ఉందని, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవోతో పాటు సిబ్బంది విధులపై నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు.

బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి

ధర్మారం: మహిళలు తీసుకున్న స్త్రీనిధి బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించి ఎన్‌పీఏ కాకుండా చూసుకోవాలని స్త్రీనిధి రీజనల్ మేనేజర్ దుర్గప్రసాద్ కోరారు. ధర్మారం మండలం నందిమేడారం గ్రామంలో స్త్రీనిధి పొందిన సభ్యుల ఇళ్ల వద్దకు వెళ్లి రుణాల గురించి అవగాహన కల్పించారు. రీ పేమెంట్ 90 రోజులు దాటినా వారు ఎన్‌పీఏ సభ్యులవుతారన్నారు. ఇలాంటి సభ్యులు సకాలంలో రుణాలను చెల్లించాలని ఆయన సూచించారు. ఎన్‌పీఏ అయితే సంఘంలోని మిగతా సభ్యులు సైతం రుణాలు తీసుకునే అవకాశం కోల్పోతారని, రెగ్యులర్‌గా రీపేమెంట్ చేసిన గ్రూప్‌లకు రుణాలు తీసుకునే అర్హత ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం తులసీమాత, సెర్ప్ సీసీ స్వామి, వీవోఏ సమత, సంధ్య, భాగ్య, మల్లేశ్వరి పాల్గొన్నారు.

మైసమ్మతల్లికి మొక్కులు



మొక్కులు చెల్లిస్తున్న ట్రాక్టర్ ఓనర్స్ సభ్యులు

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ల యజమానులు గురువారం దారి మైసమ్మకు మొక్కులు చెల్లించారు. ప్రతి ఏటా వర్షాకాలం సీజన్ ముందు మైసమ్మ తల్లికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, మాజీ ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్, అధ్యక్షుడు గడ్డం మల్లారెడ్డి, సభ్యులు గుమ్మడి తరుపతి, కోరె శ్రీనివాస్, గుమ్మడి రాజిరెడ్డి, మల్లెత్తుల కనుకయ్య, నాడెల శ్రీధర్, మారం రాజు, ఆవుల శ్రీనివాస్, బొంగాని శ్రీనివాస్, వెంకటేశ్, రాజు ఉన్నారు.

దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించొద్దు

- ఆర్డీవో హనుమానాయక్



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో హనుమానాయక్

రామగిరి: ప్రజల నుంచి వచ్చే ధరణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని మంథని ఆర్డీవో హనుమానాయక్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. రామగిరి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ధరణి రికార్డులను ఆయన పరిశీలించారు. ధరణి పోర్టల్‌లో ఎన్ని సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధరణి సమస్యలపై వచ్చే ప్రజలను ఇబ్బందులు పెట్టొద్దని, పరిష్కారానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. దరఖాస్తులపై నిరక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంచందర్‌రావు, సీనియర్ సహాయకులు పొనగంటి సంపత్, ఆర్‌ఐలు రాజాబాబు, నిహారిక పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాయం అభినందనీయం



బ్యాగులు అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అందిస్తున్న సాయం, సేవా దృక్పథం అభినందనీయమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఎలిగేడు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కిట్స్ ఫర్ కిడ్స్ ఇండియా ఆధ్వర్యంలో బ్యాగులు, సామగ్రి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలిగేడు మాజీ సర్పంచ్ అర్షనపల్లి గోపాల్‌రావు మనువడు యువీ తన మిత్రులతో కలిసి కిట్స్ ఫర్ కిట్స్ ఇండియా ఎన్జీవో సంస్థ ఏర్పాటు చేశారు. ఆ సంస్థ ద్వారా నిధులు సమీకరించి రాష్ట్రంతోపాటు యూపీ, బీహార్ రాష్ట్రాల్లో పలు సేవా కార్యక్రమాలు అందించడం అభినందనీయమని కొనియాడారు. పాఠశాల సమస్యలను హెచ్‌ఎం దేవేందర్‌రావు తెలుపగా ఎన్నారై శ్రీనివాసరావు స్పందించి మినీ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఎంఈవో కవిత, పాఠశాల హెచ్‌ఎం గంద్ర దేవేందర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, ఎన్నారై దంపతులు అర్షనపల్లి శ్రీనివాసరావు–శ్రీవాణి, అర్షనపల్లి రూపిన్, జూపల్లి గోపాల్‌రావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రేఖ, మాజీ జెడ్పీటీసీ గోపగాని సారయ్యగౌడ్, మాజీ సర్పంచులు భూర్ల సింధూజ, వెంకటేశ్వర్‌రావు, పర్శరాములుగౌడ్, మండిగ రాయనర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ నరహరి సుధాకర్‌రెడ్డి, రంగు శ్రీనివాస్‌గౌడ్, బాసంపల్లి కొండయ్య, అమ్ముల రమేశ్, భూర్ల వెంకటసత్యం పాల్గొన్నారు.

ఘనంగా హాస్టల్ డే



కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి

రామగిరి: సెంటనరీకాలనీ జేఎన్టీయూ కళాశాలలోని రెండు హాస్టళ్లలో బుధవారం అర్ధరాత్రి హాస్టల్‌డే ఘనంగా నిర్వహించారు. బాలుర, బాలికల వసతి గృహాల్లో కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈఈఈ విభాగాధిపతి ఆర్.దుర్గారావ్, డిఈఈ సతీశ్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవి కుమార్, లైబ్రరీ ఇన్‌చార్జి రమణ, హాస్టళ్ల ఇన్‌చార్జి సుమన్, కేర్ టేకర్స్ పాల్గొన్నారు.

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోవాలి

పెద్దపల్లిరూరల్: ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలని ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం పలువురు మతపెద్దలతో సమావేశమై సూచనలు చేశారు. 17న జరిగే బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. సీఐ కృష్ణ, ఎస్సై మల్లేశ్ ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని ఏపీఏ గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని గురువారం ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లుకు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. మ్యాన్ వే, మొదటి షిఫ్ట్‌కి ఇరువైపులా ఎండకి, వర్షానికి కార్మికులు ఇబ్బందులు పడకుండా రేకుల షెడ్డు నిర్మించాలని, లాకర్స్ మరమ్మతుతో పాటు నూతన లాకర్స్ ఏర్పాటు చేయాలని, అండర్‌గ్రౌండ్‌లో పలు ప్రదేశాలలో స్కావెంజర్లను ఏర్పాటు చేయాలని, కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి సింగరేణి యజమాన్యం కృషి చేయాలని, లేనిపక్షంలో సీఐటీయూ పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. సీఐటీయూ నాయకులు దొమ్మటి కొమురయ్య, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, అహ్మద్ పాషా, రమణారెడ్డి, కుమార్, వేణుగోపాల్, రవికుమార్, సుధాకర్, మనోహర్, తిరుపతి, హబీబ్ పాషా పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేకుండా బస్సులు నడిపితే చర్యలు తప్పవు



బస్సును సీజ్ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

సుల్తానాబాద్‌రూరల్: జిల్లాలో ఫిట్‌నెస్ లేకుండా స్కూల్, కళాశాలల బస్సులు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని పెద్దపల్లి ఆర్టీవో రంగారావు తెలిపారు. సుల్తానాబాద్ మండలంలో గురువారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఫిట్‌నెస్ లేని బస్సులను తనిఖీ చేశారు. పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాలకు చెందిన బస్సు ఫిట్‌నెస్ లేకపోవడంతో సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడిపితే సీజ్ చేయడంతో పాటు సంబంధిత పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకుంటామని ఆర్టీవో హెచ్చరించారు. తనిఖీల్లో ఏంవీఐలు శ్రీనివాస్, శివస్వప్న, మధు, ఆర్టీఏ సిబ్బంది ఉన్నారు.

అసంఘటిత కార్మికులు సంఘటితం కావాలి

ఎలిగేడు: అసంఘటిత కార్మికులు సంఘటితం కావాలని భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి అన్నారు. ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలో గురువారం భవన నిర్మాణ కార్మికుల సమైక్య సంఘం సమావేశం జరిగింది. ఎంపీపీ స్రవంతి మాట్లాడుతూ గ్రామంలోని కార్మికులకు తన సొంత ఖర్చులతో లేబర్‌కార్డులను ఇప్పిస్తామని తెలిపారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు ఆ సంఘం సుల్తాన్‌పూర్ గ్రామ కమిటీని జిల్లా అధ్యక్షుడు ప్రకటించారు. గ్రామ అధ్యక్షుడిగా రాయపాక ఉపేందర్, ఉపాధ్యక్షుడిగా గోస్కి లచ్చయ్య, ప్రచార కార్యదర్శిగా జాతరగొండ అశోక్, కోశాధికారిగా నరేందర్‌ను నియమించారు. కమిటీ సభ్యులు రాయపాక శ్రీను, కుక్క మల్లేశ్, పెద్దపల్లి మండల అధ్యక్షుడు సతీశ్, ఎలిగేడు మండల కోశాధికారి శ్రీహరి, భవన నిర్మాణ సంఘం కార్మికులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం సీజ్

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లిలోని డీలర్ పూసాల శంకరయ్యకు చెందిన రేషన్ షాపును గురువారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. దుకాణంలో 105 బియ్యం బస్తాలకు గాను 52.5 క్వింటాళ్ల వ్యత్యాసం ఉండడంతో సీజ్ చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

ప్రశ్నించే యూనియన్లను టార్గెట్ చేస్తే ఊరుకోం

గోదావరిఖని: ప్రశ్నించే సంఘాల నాయకులను టార్గెట్ చేస్తే ఊరుకోబోమని సీఐటీయూ ఆర్జీ–1 బ్రాంచి కార్యదర్శి మెండె శ్రీనివాస్ అన్నారు. గురువారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమాన్యం గుర్తింపు పత్రం ఇవ్వకుండా అధికారిక కార్యక్రమాలతో పాటు సేఫ్టీ కమిటీలకు ఆహ్వానిస్తున్నారన్నారు. గనిలో వెంటిలేషన్‌తో పాటు సమస్యలపై మాట్లాడే ప్రతిపక్ష యూనియన్లకు చెందిన కార్మికులను షిఫ్ట్ చేంజ్‌ల పేరిట ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. వారి స్థానంలో తమకు అనుగుణంగా ఉన్న వారిని మార్చుకోవాలని చూస్తున్నారన్నారు. గెలిచామని చెప్పుకుంటున్న సంఘాలు ఆరునెలలుగా గుర్తింపు పత్రం కోసం పోరాటాలు చేస్తామని చెప్తూనే యజమాన్యానికి తొత్తుగా మారి, పైరవీలు చేసుకుంటున్నారని విమర్శించారు. కార్మిక వాడలకు శుభ్రమైన మంచినీరు ఇప్పించడంతోపాటు పారిశుధ్య వ్యవస్థను మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షులు ఆరెపల్లి రాజమౌళి, సానం రవి, వంగల రాములు, శివరాంరెడ్డి, శంకరన్న, సమ్మయ్య, సాయికిరణ్, శ్రీనివాస్, జనార్దన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కత్తితో దాడిచేసిన వ్యక్తి అరెస్టు

జ్యోతినగర్: కత్తితో దాడిచేసిన వ్యక్తిని ఎన్టీపీసీ పోలీసులు అరెస్టు చేశారు. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి ప్రగతినగర్‌లో బుధవారం ఖాజిల్లికి చెందిన మేకల మల్లేశంపై కుమారస్వామి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కేసు నమోదు చేసి విచారణ అనంతరం కుమారస్వామిని అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ పక్కా సమాచారం మేరకు ఐతరాజుపల్లి గ్రామ శివారులోని పంటపొలాల్లో అదే గ్రామానికి చెందిన మల్లయ్య, హుస్నాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన రాజయ్య సుమారు అక్రమ నిల్వ ఉంచిన 40క్వింటాళ్ల బియ్యం ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసిందని, అట్టి బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బియ్యాన్ని పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాంకు తరలించినట్లు పేర్కొన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డీటీసీఎస్‌లు శంకర్ గౌడ్, రవీందర్‌రాథోడ్, ఎఫ్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రయివేట్ స్కూల్‌లో పుస్తకాలు విక్రయిస్తున్నారని ఫిర్యాదు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ఓ ప్రయివేట్ పాఠశాల యజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా బుక్స్, యూనిఫాం దుస్తులు విక్రయిస్తున్నారంటూ ఏబీవీపీ నాయకులు రాజశేఖర్, ప్రవీణ్, అజయ్, సాయితేజ, రుషి, వినయ్, ప్రకాశ్ గురువారం మండల విద్యాధికారికి ఫిర్యాదు చేశారు.

దరఖాస్తులు ఆహ్వానం

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ ఆదర్శ పాఠశాలలో హిందీ బోధనకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేయాలని ప్రిన్సిపాల్ పద్మశ్రీ కోరారు. హవర్లీ బేస్డ్ టీజీటీ పోస్టు ఖాళీ ఉందని, డిగ్రీ అర్హత కలిగి హిందీ పండిట్ ట్రైనింగ్ కలిగి ఉండాలని, రెండేళ్ల సంవత్సరాల అనుభవం తప్పనిసరని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు అవసరమైన ధృవీకరణ పత్రాలతో 18న ఆదర్శ విద్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

గృహజ్యోతి దరఖాస్తుల నమోదు ప్రారంభం

జూలపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గృహజ్యోతిలో సబ్సిడీ రాని వినియోగదారుల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తులకు పథకంలో సబ్సిడీ రాని వినియోగదారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

సుల్తానాబాద్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ కోరారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు సంబంధించి రీయింబర్స్‌మెంట్ దాదాపు రూ.6వేలకోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని చెల్లించాలని సీఎంను కోరారు. రాష్ట్ర కోఆర్డినేటర్ దశరథం, జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి, అశోక్, అభిషేకం, నిఖిల్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.


షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు షురూ

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని రామగుండం రైల్వేస్టేషన్ ఎదుట ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌ను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌కు ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో మార్కింగ్ చేయించి పనులను ప్రారంభించారు.

సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖనిటౌన్: ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను దళిత హక్కుల పోరాట సమితి నాయకులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దెల దినేశ్ మాట్లాడుతూ రామగుండం ప్రాంతానికి మంజూరైన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం గోదావరిఖనికి రావడంలో జాప్యం జరుగుతోందన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విన్నవించగా సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

ఇండియా ఉమెన్స్ ఉషూ లీగ్ పోటీల్లో ప్రతిభ



వడ్డెపల్లి నవీన

రామగుండం/గోదావరిఖనిటౌన్: కర్ణాటకలోని భాగల్ కోర్టులో ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు జరిగిన సౌత్ జోన్ ఖేలో ఇండియా ఉమెన్స్ ఉషూ మహిళా సీనియర్స్ లీగ్ పోటీల్లో తైజీయన్ టౌలు విభాగంలో రామగుండం క్రీడాకారిణి వడ్డెపల్లి నవీన ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రతిష్టాత్మకమైన ఖేలో ఇండియా పోటీల్లో రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లా తరఫున తొలిసారిగా బంగారు పతకం స్వాధీనం చేసుకోవడం గర్వకారణమని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. నవీనను అభినందించారు. కోచ్‌లు వేముల సతీశ్, శివ, మహేశ్, వీఎస్‌కేఏఐ జిల్లా అధ్యక్షుడు వడ్డెపల్లి సురేశ్, సీనియర్ కరాటే మాస్టర్ తగరపు శంకర్, ముక్కెర చంద్రశేఖర్, బోయపోతు రాము ఉన్నారు.



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అర్ధ శతాబ్ది ఆత్మీయ సమ్మేళనం

గోదావరిఖనిటౌన్: యాభై ఏళ్ల క్రితం (1974–75 విద్యా సంవత్సరం) గోదావరిఖని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గురువారం స్థానిక మార్కండేయకాలనీలోని రాజ్యలక్ష్మి గార్డెన్‌లో అర్ధ శతాబ్ది ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. తాము చదువుకున్న పాఠశాలకు వెళ్లి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పలు రకాల ఉద్యోగాల్లో స్థిరపడిన వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం తమకు చదువులు నేర్పిన గురువులు గోవర్ధన్, రాజకొమురయ్యను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈసందర్భంగా మ్యాజిక్ రాజా, చంద్రపాల్, చిలుముల శంకర్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులు బుద్ధవనం ప్రాజెక్ట్ మాజీ స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, మాజీ డీఎస్పీ రవీందర్, రామగుండం మాజీ మేయర్ జాలి రాజమణి, న్యాయవాది బల్మూరి అమరేందర్‌రావు, పులి మోహన్, బాలకృష్ణ, పెండ్యం సారయ్య, ఆకుల శంకర్, చంద్రశేఖర్, రాజ్‌కుమార్, నారాయణ, సాంబయ్య, కనకయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐఎన్టీయూసీ కృషి



మాట్లాడుతున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: ఎన్టీపీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐఎన్టీయూసీ కృషి చేస్తుందని యూనియన్ జాతీయ సీనియర్ కార్యదర్శి, ఎన్టీపీసీ ఎన్సీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా అన్నారు. గురువారం యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. ఇటీవల ఒడిశాలోని తాల్చేరులో జరిగిన ఎన్టీపీసీ ఫెడరేషన్ సమావేశంలో పలు అంశాలపై చర్చించి, సంస్థ హెచ్‌ఆర్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. రామగుండం ప్రాజెక్టులో భూ నిర్వాసిత కోటాలో ఉద్యోగం పొందినవారికి కెరీర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(సీడీపీ)లో శిక్షణ అందించి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

ఎన్టీపీసీ ఉద్యోగి శ్రీపతిరావు తనపై చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకోవాలని బాబర్ సలీంపాషా సూచించారు. నిబంధనల ప్రకారమే టౌన్‌షిప్‌లోని క్వార్టర్‌లో నివాసం ఉంటున్నామని, సంబంధిత అద్దె చెల్లించడం జరిగిందని తెలిపారు. తనపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోని క్రమంలో చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. సమావేశంలో ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ (ఉద్యోగ గుర్తింపు సంఘం) వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కృష్ణయ్య, ప్రధానకార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్, కందుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడుతున్నారు

జ్యోతినగర్: ఐఎన్టీయూసీ నాయకుడు బాబర్ సలీంపాషా తనపై వేధింపులకు పాల్పడుతున్నాడని ఎన్టీపీసీ తెలంగాణ కార్మిక సంఘం నాయకుడు, ఎన్టీపీసీ ఉద్యోగి కె.శ్రీపతిరావు తెలిపారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లోని హాల్‌లో మాట్లాడారు. రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లో అక్రమంగా క్వార్టర్‌లో నివాసముంటున్నాడని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు తనను బాబర్ దూషించారని ఆరోపించారు. అతడు చేస్తున్న అక్రమాలపై హైదరాబాద్‌లోని సీబీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేరళలోని కాయంకుళం ఎన్టీపీసీలో ఉద్యోగం చేస్తున్న క్రమంలో అనారోగ్య కారణాలతో రామగుండం ప్రాజెక్టుకు డిప్యూటేషన్‌పై వచ్చానని, తన డిప్యూటేషన్ రద్దు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని పేర్కొన్నారు.

పశువులను తరలిస్తున్న వ్యాన్ల పట్టివేత

పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్ ప్లాజా వద్ద ఎద్దులను తరలిస్తున్న రెండు వ్యాన్‌లను గురువారం బసంత్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కౌటాల నుంచి హైదరాబాద్‌కు రెండువ్యాన్లలో 24 ఎద్దులను తరలిస్తున్నారు. కన్నాల టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీస్‌సిబ్బంది తనిఖీ చేయడంతో రెండువ్యాన్లలో ఎద్దులు ఉన్నాయి. బసంత్‌నగర్ ఎస్సై స్వామి వ్యాన్లను తనిఖీ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి గోదావరి బ్రిడ్జి వద్ద టూటౌన్ పోలీసులు గురువారం ఎద్దులను తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకున్నారు. ఆసిఫాబాద్ కౌటాల నుంచి హైదరాబాద్‌కు డీసీఎం వ్యాన్‌లో 12 ఎద్దులను తరలిస్తుండగా టూటౌన్ పోలీసులు తనిఖీ నిర్వహించారు. ఎలాంటి అనుమతి లేకుండా 12 ఎద్దులను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుకున్న ఎద్దులను వాటి సంరక్షణ నిమిత్తం సుల్తానాబాద్‌లోని గోశాలకు తరలించినట్లు టూటౌన్ పోలీసులు పేర్కొన్నారు. అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న జన్నారానికి చెందిన ఎండీ ఇక్బాల్, మహారాష్ట్రకు చెందిన బోడ మంగేశ్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రవీందర్ పేర్కొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లపై పేరెంట్స్‌కు నమ్మకం కలగాలి



హెచ్‌ఎంను సన్మానిస్తున్న జెడ్పీటీసీ సంధ్యారాణి

రామగుండం: ప్రభుత్వ పాఠశాలలపై పేరెంట్స్‌కు నమ్మకం కుదరాలని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యాబోధనలో మార్పులు తీసుకురావడంతో విద్యార్థులను ఆకట్టుకునే అవకాశం ఉంటుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి అన్నారు. పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల హెచ్‌ఎంలను గురువారం ఆమె సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. పాట్యాల హైస్కూల్ హెచ్‌ఎం.ఎం.సంగీత, మోడల్ (ఆదర్శ) విద్యాలయం ప్రిన్సిపాల్ సారాతస్నీమ్‌ను సన్మానించారు. సంధ్యారాణి మాట్లాడుతూ గతంతో పోల్చితే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మీస అనిత, హరీశ్, బీజేపీ కోఆర్డినేటర్ కొండపర్తి సంజీవ్, సోషల్ మీడియా కన్వీనర్ సుమంత్ పటేల్, పైతరి రాజు, వినయ్, బర్పటి నారాయణ, శ్రీనివాస్, ఉపాధ్యాయులు గద్దె శ్రీనివాస్, శ్రీధర్, తిరుపతి, లక్ష్మయ్య, రాజనర్సయ్య పాల్గొన్నారు.

సొంతింటి రుణం వడ్డీ చెల్లింపుపై ఆంక్షల ఎత్తివేత

గోదావరిఖని: సింగరేణిలో కార్మికుల సొంతింటి నిర్మాణం కోసం అప్పుపై వడ్డీ చెల్లింపు విధానంలో గతంలో ఉన్న ఆంక్షలను ఎత్తివేసేందుకు యాజమాన్యం అంగీకరించిందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులు గతంలో బ్యాంకుల నుంచి ఇంటి నిర్మాణం లేదా ఇల్లు కొనుగోలు రుణం తీసుకుంటే ఒక సంవత్సరంలోపు వారికి మాత్రమే వడ్డీ చెల్లించారని, దీంతో చాలా మంది కార్మికులు సంవత్సరం దాటినవారికి యాజమాన్యం వడ్డీ చెల్లించలేదన్నారు. అలాగే 8.33 శాతం కంటే తక్కువ వడ్డీకి బ్యాంకు అప్పు తీసుకున్న వారికి 6 లేదా7 శాతం చెల్లించారన్నారు. ఈసమస్యను ఏఐటీయూసీ సింగరేణి డైరెక్టర్(పా), ఫైనాన్స్ జీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. తక్కువ వడ్డీకి రుణాలు తీసుకున్న వారికి కూడా 8.33 శాతం చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరిస్తూ సర్క్యులర్ జారీ చేసిందన్నారు.